తెలంగాణలో 2026 తర్వాత డీలిమిటేషన్ తప్పదు

○ మాజీ ఎంపీ వినోద్ కుమార్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో 2026 తర్వాత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తప్పదని, శాసనసభ సీట్ల పెంపకం జరుగుతుందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సుప్రీంకోర్టు తీర్పు, డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ చట్టంపై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం శాసన సభ సీట్లను పెంచాలని కోరుతూ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో, తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరగదే మోననే అనుమానాలను వినోద్ కుమార్ నివృత్తి చేశారు. సుప్రీంకోర్టు తన తీర్పులో సెక్షన్ 26ను ఆర్టికల్ 170, సబ్‌క్లాజ్ 3కి లోబడి చూసిందని ఆయన వివరించారు. ఆర్టికల్ 170, సబ్‌క్లాజ్ 3 ప్రకారం 2026 తర్వాత జరిగే జనగణన (సెన్సస్) ఆధారంగానే డీలిమిటేషన్ జరగాలని రాజ్యాంగంలో ఉందని గుర్తు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో సీట్ల పెంపుదల, తెలుగు రాష్ట్రాల్లో పెంపుదల లేకపోవడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం కాబట్టి ఆర్టికల్ 170 వర్తించదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 26లో సబ్జెక్టు టూ అనే పదం చేర్చడం వల్లే ఈ సమస్య తలెత్తిందని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. దీనికి బదులుగా నాట్ విత్ స్టాండింగ్ అనే పదం ఉండి ఉంటే రాజ్యాంగ సవరణ అవసరం లేకుండానే సీట్ల పెంపుదల జరిగేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ప్రకారం, 2027 మార్చి 1న జనగణన ప్రారంభమై 2027 చివరి నాటికి పూర్తవుతుందని ఆయన తెలిపారు. కాబట్టి 2026 తర్వాత జరిగే జనగణన అనంతరం డీలిమిటేషన్ తప్పనిసరిగా జరుగుతుందని, తద్వారా సెక్షన్ 26 అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. 2028లో జరగబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు, 2029లో జరగబోయే పార్లమెంటు ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ జరిగి, కేంద్ర ప్రభుత్వం సీట్ల పెంపకం చేయక తప్పదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2026లో జరగబోయే సెన్సస్ తర్వాత మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, సీట్ల పెంపుదలతో పాటు డీలిమిటేషన్ కూడా జరుగుతుందని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఎన్నిక

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బాలస ముద్రంలోనీ విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22న హైదరాబాదులోని బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను గెలిపించినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఐక్యతను కూడగట్టి మేనేజ్మెంట్, ప్రభుత్వ సహకారంతో అసోసియేషన్ ప్రతినిధులతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు.తెలంగాణ రాష్ట్రంలో వున్న మిగతా అసోసియేషన్ల కంటే భిన్నంగా తమ అసోసియేషన్ ను మరింత అభివృద్ధి పరుస్తానని దానయ్య అన్నారు. భారత రాజ్యాంగం రచించిన అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు అందాల్సిన హక్కులను కాలరాస్తూ ఈరోజు వరకు కూడా పదోన్నతులు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజ్యాంగ హక్కులను పెండింగ్ సమస్యలపై పూర్తిస్థాయిలో అమలుపరిచే విధంగా మేనేజ్మెంట్ పైన, ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకునే దిశగా తమ సంఘం తరపున పోరాడుతామని ధీమా వ్యక్తం చేశారు.

మెరుగైన వైద్య సౌకర్యం అందించడమే హాస్పిటాలిటీ లక్ష్యం : ఈటల

విశ్వంభర, దుండిగల్ : మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడమే హాస్పిటాలిటీ లక్ష్యమని,నిరుపేదల కోసం తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సదుపాయం అందించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నాడు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,కొంపల్లి మున్సిపాలిటీ లోని జెడే స్పెశాలిటీ హాస్పిటల్స్ ను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో పనిచేసినపుడే ప్రజల మన్ననలు పొందుతారన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు అన్ని విభాగాలను ప్రజలకు అందుబాటులోకి తేవడం ఘర్షించదగ్గ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సిహెచ్ మాల్లారెడ్డి,ఎమ్మెల్యే కెపి వివేకానంద, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.హన్మంత్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, హాస్పిటల్ చైర్పర్సన్ డాక్టర్ రజిని అశోక్, డైరెక్టర్లు డాక్టర్ శైలజ పాటిబండ్ల, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ ప్రియదర్శిని పక్కాల వైద్య బృందం పాల్గొన్నారు.

బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో పీసీసీ చీఫ్ చర్చకు సిద్ధమా..?

విశ్వంభర, సంగారెడ్డి : బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసులు చర్చకు రావాలని బీ జేపీ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘునందన్ రావు మాట్లాడుతూ.. గత 3 రోజులుగా కొందరు కాంగ్రెస్ పెద్దలు ఎక్కడ చూసినా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, నాలుగున్నర దశాబ్దాలలో బీజేపీ బీసీలకు ఏం చేసిందో, దళితులకు, గిరిజనులకు ఏం చేసిందో నేను చెబుతా అని, మరి బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, విప్ ఆది శ్రీనివాస్ చెబుతారా అంటూ ప్రశ్నించారు. 56 శాతం బీసీలు ఉంటే ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడం కరెక్టేనా ఆది సీనన్నా అని హెద్దేవా చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 250 మందిని కాంగ్రెస్ సీఎంలను చేస్తే అందులో 43 మంది బీసీ, ఓబీసీలను మాత్రమే చేసిందని ఆరోపించారు. బీజేపీ 1980లో పుట్టింది కేవలం నాలుగున్నర దశాబ్దాలుగా వచ్చింది. 45 సంవత్సరాల్లో 48 మందిలో 21 మంది ఓబీసీలను ముఖ్యమంత్రులుగా చేసింది. గణాంకాలతో చర్చకు వస్తా ఎక్కడ రమ్మంటే అక్కడ వస్తాను అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మంత్రి వర్గం మళ్ళీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 17.2 శాతం మందిని మాత్రమే కాంగ్రెస్ ఓబీసీలను సీఎం చేసిందని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్ ఉన్నపుడు కాంగ్రెస్ పార్టీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఉన్నారని, బీజేపీకి బండి సంజయ్ ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఉన్నారని హెద్దేవా చేశారు. మేం బీసీలకు అధ్యక్ష పదవి ఇస్తే మీరు అగ్రవర్ణాలకే ఇచ్చారన్నారు. ఎన్డీఏ కూటమిలో 20 మంది సీఎంలు ఉంటే ఐదుగురు ఓబీసీ, ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు మైనార్టీలు సీఎంలుగా ఉన్నారన్నారు. అదే మన్మోహన్ సింగ్ క్యాబినెట్ లో కేవలం ఇద్దరు ఓబీసీలు మంత్రులుగా ఉన్నారన్నారు. మోడీ క్యాబినెట్ లో 21 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారని తెలిపారు. దేశానికి రాష్ట్రపతిగా దళితులను, గిరిజనులను చేసిన ఘనత బీజేపీదన్నారు. తెలంగాణకి రెండు కేంద్ర మంత్రి పదవులు ఇస్తే ఓ బీసీకి మంత్రి పదవి ఇచ్చామన్నారు. తనకు సంబందంలేని వాటిపై హెచ్. సీయు భూముల విషయంలో బీజేపీ ఎంపీలపై కేటీఆర్ బట్ట కాల్చి మీద వేశాడన్నారు. హెచ్. సీయు విషయంలో కేటీఆర్ మొదట కొండా విశ్వేశ్వర్ రెడ్డిపై, ఆ తరువాత నా పై ఆరోపణలు చేశాడన్నారు. కేటీఆర్, ఎంపీ సీఎం రమేష్ ఎపిసోడ్ పై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బీసీలకు ఎవరూ ఏ మేరకు న్యాయం చేశారో చర్చకు రావాలని మరో సారి సవాలు విసిరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.

మాల ఉద్యోగుల విద్యార్థుల సమస్యలను

సీఎం దృష్టికి తీసుకువెళ్తా

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వల్ల తెలంగాణలోని మాల విద్యార్థులు, ఉద్యోగులకు జరుగుతున్న తీరని అన్యాయాన్ని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డా. మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ లు కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ను కోరారు. శనివారము వివిధ యూనివర్సిటీల కు చెందిన మాల విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి సెక్రటేరియట్ లో తెలంగాణ రాష్ట్ర కార్మిక. గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ని స్వయంగా కలిసి తెలంగాణలో మాల విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను లెక్కలతో సహా రోస్టర్ పాయింట్ వల్ల జరుగుతున్న అన్యాయాన్ని వినతిపత్రం ద్వారా అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మాల విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల మాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్ ఫార్మసీ కాలేజీలో ర్యాగింగ్ కలకలం..!

- యాజమాన్యం హెచ్ఆర్సీలో ఫిర్యాదు

విశ్వంభర, ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని ఫార్మాసీ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేగింది. ర్యాగింగ్ వేధింపులకు తాళలేక కాలేజీ నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తున్నది. విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం వేధింపులకు గురి చేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను బాధిత విద్యార్థిని ఆశ్రయించింది. ఖమ్మం జిల్లా పాల్వంచలోని కేఎల్ఆర్ ఫార్మసీ కాలేజీలో ర్యాగింగ్ తాళలేక ఓ విద్యార్థిని హెచ్ఆర్సీలో ఫిర్యాదు చేసింది. ర్యాగింగ్‌తో వేధింపులు తాళలేక కాలేజీ నుంచి వెళ్లిపోయిన తనకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం వేధిస్తుందని బ్రతి ఫిర్యాదులో పేర్కొంది. రూ.3లక్షలు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటున్నారని.. సదరు కాలేజీపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరింది. దీనిపై స్పందించిన హెచ్ఆర్సీ విద్యార్థికి వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించింది. సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేసే అధికారం కాలేజీ యాజమాన్యానికి లేదన్న కమిషన్..రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీలకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నెల రోజుల్లో ఈ అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

మోస్ట్ పాపులర్ వైశ్య మేల్ 2025 గా డా. నరేష్ కుమార్ గజ్జల

విశ్వంభర, హైదరాబాద్: గచ్చిబౌలిలోని ప్రధాన్ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించిన వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ లో టి ఎక్స్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. నరేష్ కుమార్ గజ్జల 2025 సంవత్సరానికి "మోస్ట్ పాపులర్ వైశ్య మేల్" అవార్డును అందుకున్నారు. వైశ్య సమాజంలో విశిష్ట ప్రతిష్ఠ కలిగిన ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఎమ్మాడి ఆవిష్కరించారు. నిష్పక్షపాతమైన, నాణ్యత ఆధారిత ఓటింగ్ విధానం ద్వారా విజేతలను ఎంపిక చేశారు, ఇది ప్రజాభిప్రాయానికి నిఖార్సైన అద్దంపట్టే విధంగా సాగింది. డా. నరేష్ న్యూరోసర్జరీ రంగంలో చేసిన విశేష సేవలు, రోగుల పట్ల ఆయన చూపిన మానవత్వం, కమ్యూనిటీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆయన కృషి ఈ అవార్డు అందుకోడానికి ప్రధాన కారణాలయ్యాయి. ఈ గౌరవాన్ని టి ఎక్స్ హాస్పిటల్స్ గర్వంగా పంచుకుంటోంది, ఎందుకంటే డా. నరేష్ మా సంస్థకు చెందిన వారు. తన వైశ్య సమాజంలో ఉత్తమ వైద్యుడిగా గుర్తింపు పొందడం మాకెంతో గర్వకారణం. ఇది ఆయన చికిత్సా నైపుణ్యం, మానవీయ సేవాభావం, కమ్యూనిటీకి ఇచ్చిన విలువైన కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ అవార్డ్స్ కు సుమధుర ఫౌండేషన్ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించింది. అదేవిధంగా మణేపల్లి జ్యువెల్లర్స్, వాసవి కన్స్ట్రక్షన్స్ , యెమ్మడి జ్యువెలర్స్ వ్యవస్థాపకులు వంటి ప్రముఖ వ్యాపారవేత్తల మద్దతుతో ఈ కార్యక్రమం మరింత ఘనతను సంతరించుకుంది. ఈ కార్యక్రమం వైశ్య సమాజపు ప్రతిభ, విశ్వాసం, మరియు పరంపరల విలువలకు అద్దం పట్టేలా అత్యంత అర్థవంతంగా కొనసాగింది.

ఘనంగా టీకేర్ కళాశాల 5వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విశ్వంభర, మీర్ పెట్ : మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 5 వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సిఎస్ ఎల్వి సుబ్రహ్మణ్యం, కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎల్వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలని విద్యార్థులు విజయవంతం గా గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దటం ఇన్ని వేల మందికి విద్యను అందిస్తున్న కృష్ణా రెడ్డి కి కళాశాల యాజమాన్యం కు అభినందనలు తెలిపారు. గ్రాడ్యుయేషన్ కంప్లీట్ అవగానే ఉన్నతమైన శిఖరాలను అధిరోహించే విధంగా మీరు భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటు చేసుకొని రాబోయే కాలానికి మారుతున్న టెక్నాలజీకి అనుకూలంగా కోర్సులను ఎంపిక చేసుకుని ముందుకు సాగాలని కోరారు. నేర్చుకున్న విద్యతో పాటు సంస్కారం గురువులను గౌరవించడం తల్లిదండ్రులను గౌరవించడం చదువే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడేలా ఏదైనా ఒక మంచి పని నేర్చుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ హరినాథ్ రెడ్డి , ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి , మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తీగల అనిత రెడ్డి , ప్రిన్సిపల్స్ రవిశంకర్ , మురళీమోహన్ , హెచ్వోడీలు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుపరిపాలలో తొలి అడుగు

విశ్వంభర, రాప్తాడు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు, మండల ఇంచార్జ్ ధర్మవరపు మురళి సూచనల మేరకు, రాప్తాడు మండలంలో, డోర్ టు డోర్, కార్యక్రమంలో భాగంగా రాప్తాడు మండలంలో ని ప్రతి ఒక్క బూతు 100% చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. కావున తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కన్వీనర్లు, కో కన్వీనర్లు, ఇన్చార్జిలను కో ఇన్చార్జ్లను, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ , సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్ ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ పంపకొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, సింగల్ విండో ప్రెసిడెంట్ మరూరుగోపాల్, రాప్తాడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలచర్ల ముత్యాలప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ శివ,తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై

ఎన్‌సీఈఆర్‌టీ పాఠం!

విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఆపరేషన్ సిందూర్‌లో భారత్ అనుసరించిన రక్షణ వ్యూహం, దౌత్య విధానాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ ఒక ప్రత్యేక పాఠాన్ని రూపొందిస్తున్నట్టు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. ఈ పాఠాన్ని రెండు భాగాలుగా రూపొందించారు. మొదటి భాగం 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ, రెండో భాగం 9 నుంచి 12వ తరగతి వరకూ వర్తిస్తాయి. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఇచ్చిన వ్యూహాత్మక సైనిక సమాధానాన్ని వివరిస్తూ 8 నుంచి 10 పేజీల పాఠాన్ని రూపొందిస్తున్నారని వర్గాలు తెలిపాయి. గత ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 26 మందిని కాల్చి చంపడం, అందుకు ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లపై భారత్ ఆపరేషన్ సిందూర్ కింద చర్యలు చేపట్టడం విదితమే. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావన పెంపొందించేందుకు గాను ఆపరేషన్ సిందూర్ పాఠాన్ని పాఠ్యాంశంలో చేర్చే యోచనలో ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలో ఓసారి వెల్లడించారు. దేశ పురోగతిని వివరించడం, విద్యార్థుల్లో దానిపై సానుకూల భావాన్ని పెంచడం కోసం భారత చరిత్రను స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అప్పట్లో ఆయన అన్నారు. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌ను ఉన్నత తరగతుల వారికి బోధించే ప్రయత్నం చేస్తున్నామని కూడా ఆయన వెల్లడించారు.

గుజరాత్‌లో బీజేపీని ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం: రాహుల్ గాంధీ

విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఎన్నికల అభ్యర్థులను ఎన్నుకునే సమయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని గుజరాత్‌లోని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. 'సంగతన్ సుజన్ అభియాన్(పార్టీని బలోపేతం చేసేందుకు ప్రచారం)'లో భాగంగా శనివారం ఆణంద్‌లో జరిగిన జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం పక్షపాతం వహిస్తోందని, భాజపాకు కీలకమైన గుజరాత్‌లో ఆ పార్టీని ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని రాహుల్ వ్యాఖ్యానించారు. శిక్షణా అభ్యర్థులకు ఆయన దిశానిర్దేశం చేశారు. 2027 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొన్న కాంగ్రెస్ కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షుల కోసం మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది.

రాజస్థాన్ పాఠశాల ఘటనలో దోషుల్ని శిక్షించాలి: కాంగ్రెస్.. రాజస్థాన్‌లోని ఝూలావాడ్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు కూలి ఏడుగురు పిల్లలు మరణించిన ఘటనపై కాంగ్రెస్ బీజేపీని తీవ్రంగా విమర్శించింది. దీనిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ''మీడియా నివేదికల ప్రకారం.. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం గురించి వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా అమాయక పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువగా బహుజన్ సమాజ్‌కు చెందినవారు. వీరి ప్రాణాలంటే బీజేపీ ప్రభుత్వానికి విలువ లేదా?'' అని రాహుల్ శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ''మన పిల్లల పాఠశాలల పై కప్పులు మరమ్మతులు చేయించలేని ప్రభుత్వం, 'వికసిత్ భారత్' గురించి పెద్ద కలలను చూపిస్తోంది. అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే.. బీజేపీ దేశాన్ని నాశనం చేసింది. రైలు ప్రమాదాలు, వంతెనలు కూలిపోవడం, కొత్తగా నిర్మించిన రోడ్లలో పగుళ్లు ఇవన్నీ సర్వసాధారణమై పోయాయి. బీజేపీ దృష్టి కేవలం అధికార దాహంపైనే కేంద్రీకృతమై ఉంది'' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

బాలికకు ఐలవ్‌యూ చెప్పడాన్ని

లైంగిక వేధింపుగా పరిగణించలేం

- ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టీకరణ

విశ్వంభర, హైదరాబాద్ : పోక్సో చట్టం కింద నమోదైన కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. బాలికకు ఐ లవ్ యూ చెప్పడాన్ని లైంగిక వేధింపుల కేసుగా పరిగణించలేమని స్పష్టంచేసింది. ఈ మేరకు ట్రయల్ కోర్టు తీర్పును జస్టిస్ సంజయ్ ఎస్ అగర్వాల్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసం సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీలును తిరస్కరించింది. పోక్సో చట్టం కింద కేసు నమోదైన యువకుడిని నిర్దోషిగా ప్రకటించింది. 2019 నాటి ఈ కేసులో 15 ఏళ్ల విద్యార్థిని పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా ఓ యువకుడు ఆమెకు ఐ లవ్ యూ చెప్పాడు. దీంతో విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. యువకుడిపై ఐపీసీ 354డీ, 509, పోక్సో చట్టంలోని సెక్షన్ 8, ఎస్సీఎస్టీ చట్టంలోని సెక్షన్ 3(2) కింద కేసు నమోదు చేశారు.